## క్లుప్తంగా

### మొవ్వ న్యాయమూర్తి బదిలీ



**మొవ్వ:** జ్యుడీషియల్ కం మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు సివిల్ జడ్జి పి.రాజన్‌ఉదయ్‌ప్రకాష్ వైఎస్సార్ కడప జిల్లాలోని రాజంపేట న్యాయస్థానానికి బదిలీ అయ్యారు. ఈ మేరకు మంగళవారం ఆయనకు బదిలీ ఉత్తర్వులు అందాయి. 2022వ సంవత్సరంలో మొవ్వ న్యాయస్థానానికి న్యాయమూర్తిగా ఆయన విచ్చేశారు.

### డాక్టర్ బాబు సేవలు ఆదర్శం

**గుడ్లవల్లేరు:** సమాజంలో పేదలకు చేసిన గుడివాడ ఏఎంసీ మాజీ చైర్మన్ స్వర్గీయ కొసరాజు వెంకటాద్రిచౌదరి(డాక్టర్ బాబు) సేవలు ఆదర్శనీయమని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు కొనియాడారు. డాక్టర్ బాబు వర్ధంతిని పురస్కరించుకుని కొసరాజు వెంకటాద్రిచౌదరి సేవా సమితి ప్రతినిధి కొడాలి రామరాజు ఆధ్వర్యంలో మంగళవారం గుడ్లవల్లేరులో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మజ్జిగ పంపిణీ చేపట్టారు. గుడ్లవల్లేరు ఏఎంసీ చైర్మన్ పొట్లూరి రవికుమార్ పాల్గొన్నారు.

### సుబ్బారాయుడికి అభిషేకాలు

**ముదినేపల్లి రూరల్:** ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామికి మంగళవారం భక్తులు ప్రత్యేక అభిషేకాలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు తోలేటి వీరభద్ర శర్మ ఆధ్వర్యంలో స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి పుట్టలో పాలు పోసి, నాగబంధాల వద్ద పూజలు చేసి అభిషేకాలు చేయించుకున్నారు. ఈఓ ఆర్.గంగాశ్రీదేవి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

### గంగానమ్మ ఆలయానికి సింహద్వారాల సమర్పణ

**ముదినేపల్లి రూరల్:** మండలంలోని గురజలో నూతనంగా నిర్మిస్తున్న గంగానమ్మ ఆలయానికి దాతలు సింహద్వారాలు సమర్పించారు. గ్రామానికి చెందిన వీరిశెట్టి రాంప్రసాద్, నాగమణి దంపతులు రూ.80 వేల విలువైన గ్రానైట్ సింహ ద్వారాన్ని, జంటనాగుల ప్రతిమను ఆలయ నిర్మాణదారులకు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కామినేని వెంకటేశ్వరరావు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలకు ప్రచారం




**ముదినేపల్లి రూరల్:** విద్యాసంవత్సరం ముగుస్తున్నందున మండలంలోని ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాల కోసం ఉపాధ్యాయులు ఇళ్లబాట పట్టారు. ఇందులో భాగంగా మంగళవారం పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు గ్రామాల్లోని బడి ఈడు పిల్లల ఇళ్ల వద్దే తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలల్లో ప్రవేశాలు కల్పించారు. పెయ్యేరు, కాకరవాడ, సంఘర్షణపురం, కొరగుంటపాలెం, చిగురుకోట ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు బడిఈడు పిల్లలకు పాఠశాలల్లో ప్రవేశాలు కల్పించారు.

### ఈకేవైసీ చేయించుకోవాలి

**పామర్రు:** రేషన్‌కార్డులోని ప్రతి సభ్యుడూ ఈకేవైసీని ఈ నెల 30వ తేదీలోపు చేయించుకోవాలని తహసీల్దార్ రవికాంత్ మంగళవారం తెలిపారు. ప్రస్తుతం మండల పరిధిలో 1,704 రేషన్‌కార్డులు ఉన్నాయని పేర్కొన్నారు. వీటిలో ఐదేళ్ల లోపువారు, 80ఏళ్ల పైబడిన వారు మినహాయించి మిగిలిన సభ్యులు అందరూ ఈకేవైసీని తప్పనిసరిగా చేయించుకోవాలని తెలిపారు.

### హాస్టల్‌కు వాచ్‌మన్ లేక అవస్థలు



**ముదినేపల్లి రూరల్:** స్థానిక బీసీ బాలుర హాస్టల్‌కు వాచ్‌మన్‌ను నియమించాలని స్థానికులు, విద్యార్థులు కోరుతున్నారు. ఈ హాస్టల్ వాచ్‌మన్‌గా పనిచేసిన ఆంజనేయులు గత నెల 7న పెడన హాస్టల్‌కు బదిలీ అయ్యాడు. ఇతని స్థానంలో మచిలీపట్నం రూరల్ మండలం కాళ్లపాలెం నుంచి సీహెచ్ శ్రీనివాసరావును నియమించారు. ఇప్పటికీ 45 రోజులు దాటి విద్యాసంవత్సరం ముగుస్తున్నా ఈ రోజు వరకు శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించలేదు. దీంతో వార్డెన్ సురేష్‌బాబే వాచ్‌మన్ విధులను నిర్వహించాల్సి వస్తోంది. అయితే వార్డెన్ సురేష్‌బాబుకు కైకలూరు మండలం కొల్లేటికోట హాస్టల్ వార్డెన్‌గా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడంతో హాస్టల్ నిర్వహణ కష్టతరంగా మారింది. బుధవారంతో విద్యాసంవత్సరం ముగుస్తున్నందున హాస్టల్ మూసివేయక తప్పదు. వేసవి సెలవుల్లో వాచ్‌మన్ లేకపోతే హాస్టల్లో అసాంఘిక కార్యకలాపాలు జరిగే ప్రమాదముందని, అధికారులు స్పందించి వాచ్‌మన్‌ను నియమించాలని స్థానికులు కోరుతున్నారు.

# మినుము ధర ఢమాల్

## రైతులకు తీవ్ర నిరాశ



మినుములు జల్లెడ పడుతున్న కూలీలు

**ముదినేపల్లి రూరల్:** ధర పెరుగుతుందని ఎంతో ఆశతో ఎదురుచూస్తున్న మినుము రైతులు ఒక్కసారిగా వాటి ధర తగ్గిపోవడంతో తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ఉగాది, శ్రీరామనవమి పండుగల తరువాత ధర పెరుగుతుందనే ఆశతో మినుములు నిల్వ చేసుకున్న రైతులు ఒక్కసారిగా కుదేలయ్యారు. నియోజకవర్గంలో 15 వేల ఎకరాల్లో రెండో పంటగా మినుము సాగు చేశారు. పైరు ప్రాథమిక దశలో ఆశాజనకంగా ఉన్నప్పటికీ పంట చేతికంది వచ్చే తరుణంలో పలురకాల తెగుళ్లు, వైరస్ సోకి దిగుబడులు తగ్గిపోయాయి. ప్రతి ఏటా ఎకరానికి 6 నుంచి 8 క్వింటాళ్ల దిగుబడులు వచ్చేవి. ఈ ఏడాది 3 నుంచి 4 క్వింటాళ్లకు మాత్రమే దిగుబడులు పరిమితం కావడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.

**ధర దారుణం**

గతేడాది మినుము తీతల ప్రారంభంలో క్వింటాలు ధర రూ.10 వేలు ఉండగా ఈ ఏడాది ప్రారంభంలో రూ.7,600 మాత్రమే ధర పలికింది. ఈ ధర పెరుగుతుందనే ఆశతో రైతులు ఇళ్లల్లోనే నిల్వ చేసుకోగా రోజురోజుకు ధర తగ్గిపోవడంతో అనేకమంది రైతులు భయపడి తక్కువ ధరకే విక్రయించేసుకున్నారు. అయినప్పటికీ ఆశ చావని పలువురు రైతులు ఇంకా 40 శాతం వరకు దిగుబడులు ఇళ్ల వద్దే అట్టిపెట్టుకున్నారు. ప్రస్తుతం ఈ ధర రూ.7 వేలకు పడిపోవడంతో పాటు వ్యాపారులు కొనుగోళ్లు నిలిపివేశారు. మయన్మార్ నుంచి మినుములు దిగుమతి కావడంతో మన మినుములు కొనుగోళ్లు నిలిపివేసినట్లు వ్యాపారులు చెబుతున్నారు.

**కంటి తుడుపుగా కొనుగోలు కేంద్రాలు**

రైతులకు మద్దతు ధర కల్పించేందుకు నియోజకవర్గంలోని దేవపూడి, లింగాల, తామరకొల్లు సొసైటీల్లో మినుము కొనుగోలు కేంద్రాలు గత వారం ఏర్పాటు చేశారు. కొనుగోలు కేంద్రంలో మినుములు ఎగుమతి చేసే వరకు ఖర్చులన్నీ రైతులే భరిస్తే క్వింటాకు రూ.7,400 వంతున ప్రభుత్వం మద్దతు ధర చెల్లిస్తుంది. దీంతో ఈ కొనుగోలు కేంద్రాల వైపు మొగ్గు చూపేందుకు రైతులు ఆసక్తి చూపడం లేదు. ఈ కేంద్రాల్లో విక్రయించుకునేందుకు ఆన్‌లైన్లో రైతులు తమ పేర్లను నమోదు చేసుకోవాల్సి ఉంది. ఇలాంటి సమస్యలతో కేంద్రాలు ఉన్నప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది.

### రూ.40 వేలు నష్టపోయా



నేను రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని మినుము సాగు చేశా. ప్రతి ఏటా 15 క్వింటాళ్ల దిగుబడి వచ్చేది. ఈ ఏడాది కేవలం ఎనిమది క్వింటాళ్ల మాత్రమే దిగుబడి వచ్చింది. ధర కూడా లేకపోవడంతో రూ.40వేలకు పైగా నష్టపోయాను.

– అబ్దుల్ జబ్బార్, కౌలు రైతు, అల్లినగరం

### నిరాశే మిగిలింది



పండుగల తరువాత ధర పెరుగుతుందనే ఆశతో మినుములు ఇంట్లోనే నిల్వ చేశా. ధర పెరగక పోగా రోజుకో విధంగా తగ్గిపోతుండడంతో పాటు ప్రస్తుతం కొనే నాథుడే లేడు. దీంతో ఏం చేయాలో అర్థం కాక నిరాశలో కూరుకుపోయా.

– బోయిన వెంకటనారాయణ, రైతు, లింగాల

### పోలీస్ స్టేషన్ తనిఖీ



**మండవల్లి:** స్థానిక పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ శివ కిషోర్ మంగళవారం తనిఖీ చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా నేరాల అదుపునకు తీసుకుంటున్న చర్యల గురించి సీఐ రవికుమార్, ఎస్‌ఐ రామచంద్రరావును ప్రశ్నించారు. అనంతరం సిబ్బందికి హెల్మెట్లు పంపిణీ చేశారు. హెల్మెట్‌లు సిబ్బంది ధరించాలన్నారు. అలా ధరించనివారిపై చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

### ఆర్థిక సాయం

**ముదినేపల్లి రూరల్:** అనారోగ్యంతో మృతి చెందిన మహిళ కుటుంబానికి స్థానిక ప్రముఖ వైద్యుడు అంబుల మనోజ్ మంగళవారం ఆర్థిక సాయం అందజేశారు. మండలంలోని సంఘర్షణపురం గ్రామానికి చెందిన రేమల్లి రోజానమ్మ(75) సోమవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న మనోజ్ తన కుమార్తె, వైద్య విద్యార్థిని అంబుల వైష్ణవి పేరుతో రోజానమ్మ అంత్యక్రియలకు రూ.5 వేలను ఆమె కుటుంబసభ్యులకు అందజేశారు.

# పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



తోట్లవల్లూరులో పోషకాహారం కిట్ అందజేస్తున్న ఎంపీడీఓ రవికాంత్





గుడ్లవల్లేరు మండలంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ వాణి

**తోట్లవల్లూరు:** పౌష్టికాహారంతోనే మంచి ఆరోగ్యం లభిస్తుందని ఎంపీడీఓ కేఏఎస్ రవికాంత్ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ ఆదర్శ పాఠశాల్లో పోషణ పక్వాడ్ ముగింపు కార్యక్రమం మంగళవారం జరిగింది. గర్భిణులు, బాలింతలు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని, తల్లి పాలు బిడ్డకు ఎంతో శ్రేష్టమని రవికాంత్ అన్నారు. పిల్లలకు ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు చేయిస్తూ వారికి సమతుల ఆహారం, వ్యాధి నిరోధక టీకాలు వేయించాలన్నారు. అధిక బరువు కలిగిన పిల్లలను గుర్తించి సమయానుకూలంగా ఆహారం ఇవ్వటం, తగిన వ్యాయామం చేయించాలని సూచించారు. ఎంఈఓలు జి. వెంకటేశ్వరరావు, సురేష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మల్లేశ్వరి, పాఠశాల హెచ్‌ఎం విజయశ్రీ, అంగన్‌వాడీ కార్యకర్తలు కోకిలారాణి, విజయకుమారి, సలోమి, భాగ్యం, నాగమల్లేశ్వరి, ఎంఎస్‌కే శివలీల, ఏఎన్‌ఎం నిర్మల మేరీ పాల్గొన్నారు.

**పౌష్టికాహారంపై అవగాహన అవసరం**

**గుడ్లవల్లేరు:** పౌష్టికాహారంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన అవసరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వాణి పేర్కొన్నారు. పోషణ పక్వాడ్ కార్యక్రమాన్ని వడ్లమన్నాడు, కౌతవరం, వేమవరం, పెంజేంద్ర గ్రామాల్లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శరీరంలో రక్త హీనత తగ్గించటంతో పాటు లోపాలను నివారించటంపై అవగాహన కల్పించారు.

**పమిడిముక్కలలో..**

**పమిడిముక్కల:** కపిలేశ్వరపురం పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రం–3లో మంగళవారం పోషణ పక్వాడ్ కార్యక్రమం నిర్వహించారు. వెయ్యి రోజులు సంరక్షణ, పోషణ ట్రాకర్‌లో నమోదు, పిల్లల్లో ఊబకాయం, పిల్లల్లో పోషకాహార లోపం నివారణపై వైద్యులు బాలాజీ, సీహెచ్‌ఓ రత్నమణి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగమణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనిత పాల్గొన్నారు.

**పామర్రులో..**

**పామర్రు:** మండలంలో నిర్వహిస్తున్న పౌష్టికాహారం పక్షోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. మండలంలోని ప్రాకర్ల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఈ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గొంతుపులి రామలింగేశ్వరరావు మాట్లాడుతూ పౌష్టికాహార పక్షోత్సవాల్లో అంగన్‌వాడీ అధికారులు చెప్పిన విషయాలను గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పాటించాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ పామర్రు సెక్టార్ సూపర్‌వైజర్ సత్యశ్రీ ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతాలను నిర్వహించారు.

**గుడివాడలో..**

**గుడివాడ టౌన్:** పౌష్టికాహార పక్షోత్సవాలు మంగళవారం ముగిశాయి. స్థానిక 10, 11, 13, 15, 16 వార్డుల అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ పక్షోత్సవాలు జరిగాయి. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బీకేడీ భవానీ ఆధ్వర్యంలో గర్భిణుల, బాలింతలకు అవగాహనా సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్‌లు పాల్గొన్నారు.

**సింగరాయపాలెంలో సీమంతాలు**

**ముదినేపల్లి రూరల్:** పౌష్టికాహారం పక్షోత్సవాల్లో భాగంగా మండలంలోని సింగరాయపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు మంగళవారం సీమంతాలు చేశారు. సెక్టార్ సూపర్‌వైజర్ భూపతి సుందరమ్మ, ఏఎన్‌ఎం సౌజన్య, అంగన్‌వాడీ కార్యకర్తలు బి.రత్నతులసీ, బి.సముద్రవేణి, జి.రిబ్కా పాల్గొన్నారు.

**మొవ్వలో..**

**మొవ్వ:** అధిక పోషకాలు ఉన్న ఆహార పదార్థాలు తీసుకుని గర్భిణులు, బాలింతలు, పిల్లలు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా కొనసాగాలని తహసీల్దార్ కే మస్తాన్ ఆకాంక్షించారు. కూచిపూడి, మొవ్వ, నిడుమోలు సెక్టార్ల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన పోషణ పక్వాడ్ పక్షోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని మంగళవారం స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో నిర్వహించారు. ఎంపీడీఓ విమాదేవి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ డి.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

# సోలార్‌తో భవిష్యత్ తరాలకు విద్యుత్ ఆదా

## ఏపీసీపీడీసీఎల్ ఈఈ శ్రీనివాసరావు



సోలార్ విద్యుత్ కనెక్షన్లను ప్రారంభిస్తున్న ఈఈ శ్రీనివాసరావు

**గుడ్లవల్లేరు:** సోలార్ విద్యుత్ వినియోగంతో భవిష్యత్ తరాలకు విద్యుత్ ఆదా అవుతుందని ఏపీసీపీడీసీఎల్ గుడివాడ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.బి.శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం సింగలూరులో ప్రముఖ సంఘ సేవకుడు డాక్టర్ బండారు శ్యామ్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామస్తులకు పీఎం సూర్య ఘర్ పథకం కింద సోలార్ విద్యుత్ కనెక్షన్లను ప్రారంభించేందుకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ, తమ శాఖ ఈఈ ఎం.సత్యానందం ఆదేశాల మేరకు గ్రామాల్లో సోలార్ విద్యుత్‌పై అవగాహన సదస్సులను చేపట్టి, ఆ కనెక్షన్లను అందిస్తున్నామని ఈఈ పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో పల్లెల్లో అంతా కేవలం సోలార్ విద్యుత్ వెలుగులనే చూడనున్నామని తెలిపారు. సోలార్ విద్యుత్ వినియోగంతో కేవలం సబ్సిడీయే కాకుండా గతంలో మాదిరిగా పాత పద్ధతిలో కరెంట్ బిల్లులు ఇకపై ఉండబోవన్నారు. బిల్లుల ఆదానే కాకుండా సోలార్ ద్వారా వినియోగించుకోగా వచ్చిన మిగులు విద్యుత్‌ను గ్రిడ్‌కు పంపటంతో ఆదాయ వనరులు వినియోగదారులకు సమకూరతాయన్నారు. సింగలూరు గ్రామాన్ని నూరు శాతం సోలార్ విద్యుత్ వినియోగ గ్రామంగా మార్చేందుకు ప్రతి ఒక్క ఇంటికీ సోలార్ ప్యానెల్స్‌తో యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ ఏడీ టి.కిరణ్‌బాబు, లైన్‌మెన్ కె.సత్యనారాయణ, గ్రామస్తులు మాచర్ల రమణయ్య, జనార్దనరావు పాల్గొన్నారు.

# ముగిసిన శ్రీరామ నవమి వేడుకలు



చిన్నారుల విచిత్ర వేషధారణ

**గుడివాడ టౌన్:** స్థానిక కాకర్ల వీధిలో ఏర్పాటు చేసిన పందిరిలో శ్రీరామ నవమి వేడుకలు మంగళవారం ముగిశాయి. 16 రోజుల పాటు వేడుకల అనంతరం స్వామి వారి కల్యాణం నిర్వహించారు. నటరాజ నాట్య కళాశాల విద్యార్థులతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా చిన్నారులు విచిత్ర వేషధారణ ఆకట్టుకుంది. కార్యక్రమంలో గణపతి శివ, ఎం. రమేష్, టి. నాగేశ్వరరావు, జి. గిరి, డి. రమేష్, పి. బాబ్జి, ఎస్. రాము, ఎస్. సూర్యాకాంతం, ఎ. మణికంత, కాకర్లవీధి ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

**■ సమస్యల పరిష్కారానికి కృషి**



**కైకలూరు:** నియోజకవర్గంలోని ప్రజల సమస్యలు సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తానని స్థానిక ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. మండలంలోని వరహాపట్నం కామినేని నివాసంలో మంగళవారం నియోజకవర్గంలోని ప్రజల సమస్యలపై సమావేశాన్ని నిర్వహించి వినతిపత్రాలు స్వీకరించారు.

**■ ఉర్దూ పండిట్ పోస్ట్ మంజూరు చేయాలి**

**మండవల్లి:** కలిదిండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో ఉర్దూ సబ్జెక్టు బోధించడానికి ఉర్దూ పండిట్ పోస్టు మంజూరు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ మేరకు మంగళవారం హెచ్‌ఎం బి.స్వర్ణకుమారికి గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రుల సంతకాలతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎండీ బాషార్‌తుల్లా, అబ్దుల్‌అస్లామ్ పాల్గొన్నారు.

**■ తాగునీటి సమస్య లేకుండా చర్యలు**

**మండవల్లి:** మండలంలోని పెరికెగూడెంలో తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ పెరుమాళ్ల పద్మ తెలిపారు. ఈ మేరకు మంగళవారం తాగునీటి చెరువుకు నీరు నింపే కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు పెరుమాళ్ల సత్యనారాయణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

**■ కూలర్ వితరణ**



**ముదినేపల్లి రూరల్:** స్థానిక బస్టాండ్‌లో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ వాటర్ కూలర్‌ను మంగళవారం బహూకరించారు. బస్టాండ్‌లో తాగునీటికి ప్రయాణికులు అనేక అవస్థలు పడుతున్నారు. దీనిని గుర్తించిన ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ ఆర్టీసీ అధికారులతో మాట్లాడి కూలర్ వితరణకు ముందుకు వచ్చారు. ఏలూరు ఆర్టీసీ డిపో సీఐ మురళీతో కలసి కూలర్‌ను ప్రారంభించారు.

**■ ధాన్యం కొనుగోలు**

**ముదినేపల్లి రూరల్:** మండలంలో ఖరీఫ్ సాగులో రైతుల వద్ద మిగిలిపోయిన ధాన్యాన్ని కొనుగోలు చేసి ఊరట కల్పిస్తున్నట్లు మండవల్లి సబ్‌డివిజన్ ఏడీఏ జి.వెంకటమణి అన్నారు. మండలంలోని గురజ రైతుసేవా కేంద్రాల్లో జరుగుతున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియను ఏడీఏ మంగళవారం పరిశీలించారు. అనంతరం రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన పత్రాలను ఏడీఏ అందజేశారు.

**■ వక్ఫ్ సవరణ రాజ్యాంగ విరుద్ధం**

**గుడ్లవల్లేరు:** వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధమని వైఎస్సార్ సీపీ క్రిస్టియన్, మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జాన్‌బెన్నీ లింగం అన్నారు. మంగళవారం గుడ్లవల్లేరులో ముస్లింలు శాంతి ర్యాలీని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వక్ఫ్ చట్ట సవరణ బిల్లును బిల్లును అర్ధరాత్రి పాస్ చేసిన తీరుని చూసి యావత్తు దేశం ఆశ్చర్యానికి లోనైందన్నారు. కేంద్ర ప్రభుత్వం ముస్లిం పేదలకు మంచి చేస్తాం అంటూనే వక్ఫ్ ఆస్తులను ప్రైవేట్, కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేసే విధంగా వ్యవహరించడం దారుణమన్నారు. వక్ఫ్ చట్ట సవరణ బిల్లులో ముస్లిం సమాజం పూర్తి సవరణలను వ్యతిరేకిస్తుందన్నారు. అనంతరం గుడ్లవల్లేరులో తహసీల్దార్ బి.లోకరాజుకు తమ వినతిని ముస్లిం పెద్దలు అందించారు.

**■ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి**



**కైకలూరు:** జిల్లాలో శాంతిభద్రతల పర్యవేక్షణకు కృషి చేస్తున్నట్లు ఎస్పీ కె.ప్రతాప్‌శివకిషోర్ అన్నారు. కైకలూరులో పలువురు వ్యాపారుల ఆర్థిక సహకారంతో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలు, స్థానిక ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అనుచరుల రూ.2 లక్షల విరాళంతో కొనుగోలు చేసిన డ్రోన్ కెమెరాను ఎస్పీ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి పోలీసుస్టేషన్ పరిధిలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేస్తూ నేరాల నియంత్రణకు కృషి చేస్తున్నామన్నారు. అనంతరం లోకుముడి బస్టాండ్ వద్ద ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఎస్పీ ప్రారంభించారు.

**■ భక్తులకు మజ్జిగ పంపిణీ**

**పామర్రు:** ఉండ్రపూడి–పోలవరం అడ్డరోడ్డు వద్ద ఉన్న శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలో దాతల సహకారంతో మజ్జిగ పంపిణీ మంగళవారం జరిగింది. ఆలయ ఈఓ వర ప్రసాదరావు మాట్లాడుతూ దాతలు కురుమద్దాలి గ్రామానికి చెందిన కొసరాజు రాంబాబు, మాజీ సర్పంచ్ స్వప్న దంపతుల సౌజన్యంతో మజ్జిగ పంపిణీ చేసినట్లు తెలిపారు. కూచిపూడి వాస్తవ్యులు గొట్టిపాటి శ్రీనివాస్ రాజరాజేశ్వరీ దంపతుల కుమారుడు శ్రీరామ్ త్వరలో ఆలయంలో నిర్వహించే హనుమజ్జయంతి వేడుకలకు రూ.10వేలను విరాళంగా అందజేశారని తెలిపారు.

### ఘనంగా ఏఎన్నార్ కళాశాల వార్షికోత్సవం



**గుడివాడ టౌన్:** ఏఎన్నార్ కళాశాల ఎంబీఏ విభాగం వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు మాట్లాడుతూ విద్య పూర్తయిన అనంతరం విద్యార్థులు కృషి, పట్టుదల, అంకిత భావంతో పనిచేయడం నేర్చుకోవాలని సూచించారు. నైతిక విలువలను పాటిస్తూ సమాజానికి మేలు కలిగే విధంగా వృత్తి ధర్మాన్ని నెరవేర్చాలని కోరారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పీజీఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ బీఎస్ఎస్ పద్మజ, ఎంబీఏ విభాగాధిపతి ఎంబీ సువర్చల పాల్గొన్నారు.

### వాటర్ లిఫ్టింగ్ పరిశీలన

**మండవల్లి:** స్థానిక మొగలి చెరువులో వాటర్ లిఫ్టింగ్ విధానాన్ని సర్పంచ్ మెండా ఝాన్సీ, సురేష్‌బాబు మంగళవారం పరిశీలించారు. ఈ నేపథ్యంలో వేసవి సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలను అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ శిరీష, ఏఈ కిషోర్, గన్నవరం నీటిసంఘం అధ్యక్షుడు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

# బడిఈడు పిల్లలు పాఠశాలల్లో ఉండాలి



సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్న విద్యార్థులు

**ప్రాకర్ల(పామర్రు):** బడిఈడు పిల్లలు పాఠశాలల్లో ఉండేలా తల్లిదండ్రులు సహకరించాలని పామర్రు ఎంఈఓ–2 జీ పద్మవాణి పేర్కొన్నారు. మండలంలోని ప్రాకర్ల ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ పాఠశాల అభ్యున్నతికి యాజమాన్య కమిటీ, స్థానికులు సహకరించాలని కోరారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. సర్పంచ్ గోంతుపులి రామలింగేశ్వరరావు, ఎస్‌ఎంసీ చైర్మన్ జీ ఆనంద్ మోహన్, పాఠశాల హెచ్‌ఎం రాయన శివరామప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**ముదినేపల్లిలో..**

**ముదినేపల్లి రూరల్:** మండలంలోని పలు ప్రాథమిక పాఠశాలల్లో వార్షికోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. బుధవారంతో విద్యాసంవత్సరం ముగుస్తున్నందున వడాలి–2, చినకామనపూడి, చిగురుకోట, శ్రీహరిపురం, సంఘర్షణపురం, రాజానగరం తదితర పాఠశాలల్లో వార్షికోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించి ఆకట్టుకున్నారు.

# సమ్మర్ చెస్ కోచింగ్ ముగింపు



శిక్షణ పొందిన విద్యార్థినులు

**గుడ్లవల్లేరు:** స్థానిక ఏఏఎన్‌ఎం అండ్ వీవీఆర్‌ఎస్‌ఆర్ హైస్కూల్లో జరుగుతున్న సమ్మర్ చెస్ కోచింగ్ ముగింపు సమావేశం మంగళవారం జరిగింది. విజయవాడ ముస్తాబాద్ ఎడ్యుకేషనల్ అండ్ స్పోర్ట్స్ అకాడమీ నిర్వాహకులు, పూర్వ రాష్ట్ర చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు బొబ్బా వీరభద్రరావు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు చెస్ క్రీడ విశిష్ట ప్రయోజనాలను తెలియజేశారు. గుడివాడ ఎన్టీఆర్ స్టేడియం జిమ్ కోచ్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చెస్ క్రీడ మీద ఆసక్తి కలవారికి వారి ప్రతిభను పెంచుకునే విధంగా స్టేడియం వారు చేస్తున్న పలు కార్యక్రమాలు తెలియజేశారు. కార్యక్రమంలో హైస్కూల్ డైరెక్టర్ నారాయణం శ్రీనివాసమూర్తి, ప్రిన్సిపాల్ లీనా సాతులూరి, వైస్ ప్రిన్సిపాల్ జీఎం సత్యబాబు, పీఈటీలు భూపాల్ రెడ్డి, రాధ పాల్గొన్నారు.

# కేడీబీ ట్రస్టుకు కంప్యూటర్ బహూకరణ



కేడీబీ ట్రస్టు నిర్వాహకులకు కంప్యూటర్‌ను అందజేస్తున్న బ్యాంక్ మేనేజర్ వినయ్‌తేజ

**ఎలకుర్రు(పామర్రు):** మానసిక వికలాంగులకు కేడీబీ ట్రస్టు చేస్తున్న సేవలు అభినందనీయమని నిడుమోలు యూనియన్ బ్యాంక్ మేనేజర్ వినయ్ తేజ అన్నారు. మండలంలోని ఎలకుర్రు గ్రామంలోని కాశీనాథుని దుర్గాంబ బుచ్చయ్య ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మానసిక దివ్యాంగుల పాఠశాలకు మంగళవారం కంప్యూటర్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మానసిక దివ్యాంగులకు ట్రస్టు ద్వారా ఉత్తమ సేవలను అందిస్తున్నారని తెలిపారు. ట్రస్టుకు బ్యాంక్ సహాయ సహకారాలను ఎల్లప్పుడూ అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ట్రస్టు నిర్వాహకులు కాశీనాథుని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.